జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్గొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
సోమవారం 31 ఆగస్టు 2026 పేజీలు:09






## బీసీ జేఏసీ ఆధ్వర్యంలో లింగంపల్లి చిరంజీవికి ఘన సన్మానం

**మిర్యాలగూడ, ఆగస్టు 30,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ పట్టణం లోని బంగారుగడ్డకు చెందిన లింగంపల్లి చిరంజీవి మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ఆదివారం స్థానిక బీసీ భవన్ లో మిర్యాలగూడ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చిరంజీవి నిశాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు.

వివరాలు 2లో

# బోనాల వేడుకల్లో సందడి చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, ఆగస్టు 30,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ పట్టణంలోని 6వ, వార్డు ఇందిరమ్మక్ కాలనీలో ఆదివారం నిర్వహించిన శ్రావణమాస బోనాల ఉత్సవాలలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్ఆర్) పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, వాడి పంటలతో నియోజకవర్గ సమృద్ధిగా ఉండాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ప్రార్థించారు. అనంతరం స్థానిక మహిళలు ప్రజలతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయి అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

మిగతా 2 లో




## అనియత విద్యా బోధకులు సూపర్వైజర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..!

### - సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మిరెడ్డి



**మిర్యాలగూడ,ఆగస్టు 30, (ప్రజాజ్యోతి):**

అనియత విద్యా బోధకుల, సూపర్ వైజర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మిరెడ్డి కోరారు. ఆదివారం జరిగిన బోధకుల, సూపర్ వైజర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిశీలించి వెంటనే నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు .

మిగతా 2 లో



## సీపీఎంలోకి తంగెళ్ల సుదర్శన్ రెడ్డి

### - ప్రజా సమస్యలపై పోరాటాలకు ఆకర్షితుడై పార్టీలో చేరిక

**నాగారం, ఆగస్టు 30, ప్రజా జ్యోతి:**

నాగారం మండల కేంద్రానికి చెందిన తంగెళ్ల సుదర్శన్ రెడ్డి సీపీఎం పార్టీలో చేరారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ప్రజా సమస్యలపై సీపీఎం చేస్తున్న పోరాటాలు, ప్రజల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు.

మిగతా 2 లో

# బోనాల వేడుకల్లో సందడి చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మొదటిపేజీ తరువాయి

కాలనీలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కౌన్సిలర్ ఆడోత్ అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాగు నాయక్, అంబటి కృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ జంగా లక్ష్మణ్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు..






# బీసీ జేఏసీ ఆధ్వర్యంలో లింగంపల్లి చిరంజీవికి ఘన సన్మానం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, కో-కన్వీనర్ దాసరాజు జయరాజు, మురళి యాదవ్ లు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి పాటుపడుతూ, బీసీల హక్కుల సాధనకై అహర్నిశలు శ్రమిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్న బీసీ బిడ్డ లింగంపల్లి చిరంజీవికి మరెన్నో ఉన్నత పదవులు రావాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకుడు బంటు దుర్గయ్య మాట్లాడుతూ బీసీలంతా సమైక్యంగా ఏకమై ఎక్కడ అన్యాయం జరిగినా పోరాడాలని,మా జనాభా ఎంతో మాకు అంత వాటా అనే నినాదంతోరాజకీయంగా బీసీలు ఎదగాలని, ప్రతి ఒక్కరూ బీసీల ఐక్యతకుపాటుపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కుల సంఘాల నాయకులు నక్క వెంకన్న, బంటు శ్రీనివాస్, సుధాకర్, మహేందర్ , పున్న రాములు, రాజ్ కుమార్ ఎంవిఆర్ రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

# సీపీఎంలోకి తంగెళ్ల సుదర్శన్ రెడ్డి

## ప్రజా సమస్యలపై పోరాటాలకు ఆకర్షితుడై పార్టీలో చేరిక

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా మల్లు నాగార్జున రెడ్డి ఆయనకు సీపీఎం కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తుందని మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ, అమరులు చూపిన బాటలో వారి ఆశయ సాధన కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాసు, కందాల శంకర్ రెడ్డి, వజ్జే శ్రీనివాసు, పోరోజు సైదులు, దేవరకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అనియత విద్యా బోధకులు సూపర్వైజర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..!

మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎండి. మహముద్ మాట్లాడుతూ బోధకులకు తీపి కబురు త్వరలో వస్తుందని ఆశిస్తున్నామన్నారు. సూపర్వైజర్లుగా ఉన్నవారికి అవే పోస్టులు, ఏది లేని వారికి పింఛన్లు, పెండింగ్ బకాయిలు మంజూరు,ఏజ్ బార్ అయిన వాళ్ళకి బోధకుల వారసులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రామన్న గౌడ్, జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకర్, ఖమ్మం జిల్లా ఇన్చార్జి కోటయ్య, పర్వతాలు, జానయ్య పాల్గొన్నారు.

# డాక్టర్ రాములు నాయక్ చేసిన సేవలు చిరస్మరణీయం

## - మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

### - పేద ప్రజల డాక్టర్‌గా ఎంతోమందికి అండగా నిలిచారు

### - గన్నేర్లపల్లిలో డాక్టర్ రాములు నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు



**దేవరకొండ,ఆగస్టు 30,(ప్రజా జ్యోతి) :**

డాక్టర్ నేనావత్ రాములు నాయక్ పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, పేద ప్రజల డాక్టర్‌గా ఆయన



ఎంతోమందికి వైద్య సేవలు అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కొనియాడారు.ఆదివారం డాక్టర్ నేనావత్ రాములు నాయక్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని, చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ రాములు నాయక్ విగ్రహాన్ని రమావత్ రవీంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా



రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. డాక్టర్ రాములు నాయక్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. నిరుపేదల పట్ల ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందిస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. రాములు నాయక్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అందించిన సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఎప్పటికీ పదిలంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బిల్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు టి.వి.ఎన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జార్పుల లోక్య నాయక్, వద్య దేవేందర్ నాయక్, కేతావత్ హరిలాల్, వద్య బాలు నాయక్, సర్పంచులు నేనావత్ భరత్, రమావత్ తులసీరాం, కౌన్సిలర్ అజయ్ చంద్ర, మాజీ కౌన్సిలర్ జయప్రకాశ్, నేనావత్ జైపాల్ నాయక్, నేనావత్ నాగార్జున నాయక్, కిషన్ నాయక్, రాంబాబు మరియు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోనమెత్తిన భక్తజనం..భక్తి శోభలో పోచంపల్లి

### - పోచమ్మ తల్లి కృపతో ప్రజలకు సుఖసంతోషాలు - గోరేగావ్ నియోజకవర్గ ఎమ్మెల్యే విద్యా ఠాగూర్



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 30 (ప్రజాజ్యోతి):**

పట్టణంలో బోనాల పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కటమయ్య దేవాలయం, శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవి దేవాలయం, శ్రీశ్రీశ్రీ మద్దెలమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, బోనాల కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించిన బోనాలను తలపై మోసుకొని డప్పు వాయిద్యాలు, కోలాటాలు, శివసత్తుల సందడితో దేవాలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించి కుటుంబాల సుఖసంతోషాలు, ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఇదిలా ఉండగా, భూదాన్ పోచంపల్లి శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల సందర్భంగా మహారాష్ట్రలోని గోరేగావ్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే విద్యా ఠాగూర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యా ఠాగూర్ మాట్లాడుతూ, పోచంపల్లి శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించడం మన సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.బోనాల వేడుకలతో పట్టణంలోని దేవాలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో కళకళలాడాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడంతో పోచంపల్లి పట్టణం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది.





# సలీం మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

**నాంపల్లి, ఆగస్టు, 30(ప్రజా జ్యోతి):**

మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల మైనారిటీ సెల్ అద్యక్షుడు ఎండి సలీం గుండెపోటుతో ఆకస్మికంగా ఆదివారం మృతి చెందాడు. గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, ఉపాధ్యాయలు, విద్యార్థులు కుటుంబ సభ్యులను పరామర్శించి, మనో దైర్యం కల్పించారు. మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బిఆర్ఎస్ కార్యకర్తల ద్వారా సేకరించిన రూ.1లక్ష 30వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన ఒక ఉపాధ్యాయుడిగా, లెక్చరర్ గా, ప్రొఫెసర్ గా సమాజానికి విద్యార్థులకు విద్యను అందించాడు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు పలువురు మాట్లాడుతూ అయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గుమ్మడపు నరసింహ రావు, బీఆర్ ఎస్ నాయకులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పోగుల వెంకట్ రెడ్డి, కడారి శ్రీశైలం, నక్క చంద్రశేఖర్, ఈటెం వెంకట్ రెడ్డి, పూదరి సైదులు, భాసిపాక రాములు, రామావత్ శంకర నాయక్, మూడవత్ లక్ష్మణ్ నాయక్ తదితరులున్నారు.



## పెద్దమ్మ తల్లి బోనాల పండుగలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**నార్కెట్‌పల్లి: ఆగస్టు 30 ప్రజా జ్యోతి**

నార్కెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల పండుగకు భక్తుల ఆహ్వానం మేరకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కెట్‌పల్లి గ్రామ ప్రజలపై పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# దేవరకొండ నియోజకవర్గంలో వివిధ వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్

**దేవరకొండ, ఆగస్టు 30, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రముఖ న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ పాల్గొని సందడి చేశారు. దేవరకొండ పట్టణంతో పాటు మల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పలు వివాహ శుభకార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త దంపతులు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఎర్ర కృష్ణ జాంభవ్ తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

## - నీట్ పీజీ పరీక్ష సెంటర్ ను సందర్శించిన..

## - జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ ఆగస్టు 30,(ప్రజా జ్యోతి):**

జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఆర్ పాఠశా లలో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి, కేంద్ర ఇన్‌చార్జితో పరీక్ష నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీట్ పి జి పరీక్షకు మొత్తం 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 179 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం ఇంచార్జ్ కలెక్టర్‌కు వివరించారు. పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు సిబ్బంది ని ఆదేశించారు. అదనపు సూపరింటిండెంట్ రమేష్ ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాశీమిరెడ్డి ,సిఐ ఆదిరెడ్డి ,పరీక్షల ఇంచార్జ్ ప్రొఫెసర్ ఉపేందర్ కలెక్టర్ వెంట ఉన్నారు.





# బస్సుల కోసం గంటల తరబడి ప్రయాణికుల పడిగాపులు

## - బస్సుల కోసం రోడ్లపై, షాపుల వద్ద ఎదురు చూపులు

## - సమయానికి బస్సుల రాకపోకలు వచ్చేలా చూడాలి

## - శాశ్వత బస్టాండ్ నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి

**నాంపల్లి,ఆగస్టు, 30(ప్రజా జ్యోతి):**

బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.మండలంలోని పలు గ్రామాల నుంచి నిత్యం నాంపల్లి మండల కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు సరైన సమయానికి బస్సులు లేక బస్సులు ఆలస్యంగా రావడంతో సరైన సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్టాండ్ సెంటర్ నుంచి సుమారుగా రెండు కిలోమీటర్ల దూరం ఉండడంతో కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. వెళ్లే దారిలో పలు సమస్యలు ఎదురుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. శాశ్వత బస్టాండ్ లేక బస్టాండ్ సెంటర్ లో గంటల తరబడి బస్సులు కోసం ప్రయాణికుల పడిగాపులు కాస్తూ అవస్థలు పడ్డారు. బస్సులో కోసం వేచి ఉందామనుకుంటే బస్టాండ్ లేక షాపుల వద్ద, రోడ్లపై ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు క్రమం తప్పకుండా బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించేలా సమయానికి బస్సులు వచ్చేలా చూడాలని, మండల కేంద్రంలో శాశ్వత బస్టాండ్ నిర్మించాలని, కనీస వసతులు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# మతిస్థిమితం లేని మహిళపై... కామాంధుల అఘాయిత్యం

## - పాడుపడ్డ ఇంట్లోకి లాక్కెళ్లి,బైడింగ్ వైర్ తో కట్టేసి అత్యాచారం

## - పోలీసుల అదుపులో అనుమానితుడైన ఓ మైనర్..?

**దామరచర్ల, ఆగస్టు 30,(ప్రజాజ్యోతి ):**



కలికాలమో... టెక్నాలజీ పేరుతో అరచేతిలో ఇమిడిపోయే విశ్రుంఖలత్వమో గానీ సమాజంలో.. రోజురోజుకి దారుణ ఘోరాలు వెలుగు చూస్తున్నాయి...కనీసం ఏమి జరుగుతుందో తెలియని... ప్రతిఘటించలేని మానసిక వికలాంగురాలని కూడా చూడకుండా కామాంధులు తమ క్రూరత్వాన్ని ప్రదర్శించారు... ఇంట్లో ఒంటరిగా ఉన్న మతిస్థిమితం లేని మహిళను సమీపంలో ఉన్న పడావుపడిన ఇంట్లోకి లాక్కెళ్లి... బైడింగ్ వైర్ తో చేతులు,కాళ్ళు కట్టేసి.. దారుణ అత్యాచారానికి పాల్పడ్డ గోరఖలి నల్లగొండ జిల్లా, దామరచర్ల మండలం, బొత్తలపాలెం గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.గ్రామం లో (54)ఏళ్ల మానసిక వికలాంగురాలు తన తల్లితో కలిసి ఉంటుంది. వృద్ధురాలైన తల్లి కూలి నాలి చేస్తూ, కూతురి అలనా పాలనా చూసుకుంటుంది. ఆదివారం మానసిక వికలాంగురాలైన కూతురుని ఇంటి వద్ద ఉంచి, ఆసుపత్రి కి వెళ్ళింది. ఇదే అదునుగా బావించిన గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని ఆమెను పక్కనే ఉన్న ఒక పాడుబడ్డ ఇంట్లోకి లాక్కెళ్లారు.ఆమె ప్రతిఘటించకుండా ఉండేందుకు కాళ్లు,చేతులను బైండింగ్ వైర్‌తో కట్టేసి క్రూరంగాఅత్యాచారానికి పాల్పడ్డారు.ఆసుపత్రికి వెళ్లిన బాధితురాలి తల్లి తిరిగి ఇంటికివచ్చేసరికి, బిడ్డ ఇంట్లో కనపడకపోవడం తో చుట్టుపక్కల వెతుకుతుండగా,పాడుబడ్డ ఇంట్లో నుంచి అరుపులు, ములుగులు వినిపించడంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూసింది.అక్కడ తన కూతురు కాళ్లు,చేతులు బైండింగ్ వైర్‌తో కట్టేసి ఉన్న స్థితిలో కనిపించింది. దీంతో బోరున విలపించిన మాతృమూర్తి స్థానికుల సహాయంతో పోలీసులకు ఫోన్లో సమాచారం అందించింది. సమాచారం అందుకున్న వాడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు రూరల్ సి ఐ పి ఎన్ డి ప్రసాద్ తెలిపారు.నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

**పోలీసుల అదుపులో మైనర్ :- ఈ దారుణ ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దారుణ అఘాయిత్యం ఘటనలో ఎంతమంది పాల్గొన్నారు అనే పూర్తి సమాచారం రాబడుతున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు మాత్రం ధృవీకరించట్లేదు.**

# ఉద్యమకారుల పట్ల సీఎం నిర్ణయం హర్షనీయం...!

## - తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



**మిర్యాలగూడ, ఆగస్టు 30,(ప్రజాజ్యోతి):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన ఉద్యమకారుల కుటుంబ సభ్యులకు న్యాయం చేయడంతో పాటు ఉద్యమంలో పాల్గొనీ కీలకంగా వ్యవహరించి రాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేసినఉద్యమకారులను గుర్తించి న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడం పట్ల తెలంగాణఉద్యమకారుల ఫోరం హర్ష వ్యక్తం చేసింది. ఆదివారం స్థానిక అమరవీర స్తూపం వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు మాలోతు దశరథ నాయక్, బంటు వెంకటేశ్వర్లుమాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే సారధ్యంలోని కమిటీ సభ్యులు నివేదికను సీఎంకు అందజేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఉద్యమకారులకు అనుకూలంగానిర్ణయాలు తీసుకోవాలని, ఆలస్యం చేయరాదని ఆదేశించడం ఉద్యమకారుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఎటువంటి జాప్యం చేయకుండా వెంటనే ఉద్యమకారు లను గుర్తించి న్యాయం చేయాలనిఅధికారులను ప్రభుత్వంఆదేశించిం దని త్వరలోనే ఉద్యమకారులకు న్యాయంజరుగుతుందని తెలిపారు. ఉద్యమ కారుల గుర్తింపు కోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్సైట్ ఏర్పాటు చేయబోతుందని అందులో ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారు లు తగిన ఆధారాలతో దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం గుర్తించి ఉద్యమకారులకు న్యాయం చేస్తుందని చెప్పారు. ప్రధానంగా ఉద్యమంలో ప్రాణాలు పోగొట్టుకున్న కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని ,అంగవైకల్యం చెందిన, జైలు జీవితం గడిపిన వారి కుటుంబాలకు ఉద్యోగంతో పాటు 250 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఉచిత బస్సు సౌకర్యంతోపాటు హెల్త్ కార్డులు,పెన్షన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు యర్రబెల్లి దుర్గయ్య, ఆర్టీసీ ఇక్బాల్, క్రాంతి కుమార్, ఏం డి మహమూద్, కోత్తగూడెం , కుంచం రాజ్ కుమార్, గురునాధం, మక్లా నాయక్, సైదా, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి,

## - మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

**దేవరకొండ, ఆగస్టు 30, (ప్రజా జ్యోతి) :** బీఆర్ఎస్ పార్టీ డిండి మండల అధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వర్ రావు కుమారుడు సాకేత్ రావు మేఘనల వివాహ రిసెప్షన్ హైదరాబాద్‌లోని పీఎస్ఆర్ శుక్లా కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళ్యాణ మండపానికి చేరుకున్న నేతలకు వరుని తండ్రి వెంకటేశ్వర్ రావు, కుటుంబ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నూతన వధూవరులను శాలువాతో సత్కరించి, పూలమొక్కలు అందించి ఆశీర్వదించారు. నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వరుని కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు అందజేశారు.





# హాలియాలో ఘనంగా బోనాల పండుగ

## - అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో నైవేద్యాల సమర్పణ





**హాలియా, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి):** పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని హాలియా మున్సిపాలిటీలో బోనాల పండుగ ఆదివారం అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. పసుపు,కుంకుమలు,పచ్చటి వేపమండలతో శోభాయమానంగా అలంకరించిన బోనాలతో మహిళలు,ఆడపడుచులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మంగళవాయిద్యాలు, శివసత్తుల సిగలు,భక్తుల శివనామస్మరణల మధ్య ప్రదర్శనగా వెళ్లి ముత్యాలమ్మ తల్లికి,గ్రామాన్ని రక్షించే బొడ్రాయికి,భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. గ్రామ దేవతలు శాంతించి సకల జనులను చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాలియా పట్టణంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ కుందూరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్ హాజరై అమ్మవారికినమస్కరించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నకిరేకంటి అన్నపూర్ణ సైదులు,చిట్టిప్రోలు శ్రీదేవి కరుణాసాగర్,మహమ్మద్ మజాహర్ మొహినుద్దీన్, బొంగరాల యేసు రాజు,పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్,సర్పంచ్ కందుల మదన్ రెడ్డి,జూపల్లి శ్రీనివాస్, వర్కాల శ్రీనివాస్ రెడ్డి,నామిని సుధాకర్,జితేందర్ రెడ్డి,పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర అమూల్యం

## - ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి



**హాలియా,ఆగస్టు30(ప్రజా జ్యోతి)**

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర అమూల్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి అన్నారు.హాలియా పట్టణంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అనుముల మండల పిఆర్ టియూ ఎస్ అధ్యక్షుడు చెన్ను వెంకటరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలోనూ విద్యాబోధనలోనూ వెంకటరెడ్డి చూపిన చొరవ,నిబద్ధత అభినందనీయమని కొనియాడారు.24 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో విద్యారంగానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ,భావి జీవితంలో ఆయన ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.తన ఎమ్మెల్సీ ఎన్నికల విజయంలో తన వంతు పాత్ర పోషించాడని అభినందించారు.సెప్టెంబర్ 1వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.అనంతరం చెన్ను వెంకటరెడ్డి దంపతులను పి ఆర్టి యూ ఎస్ రాష్ట్ర కమిటీ తరపున శాలువాలు,పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిఆర్ టి యూఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొల్లు శ్రీనివాస్ రెడ్డి,అనుముల మండల ప్రధాన కార్యదర్శి మంచికంటి మధు,హాలియా జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సలికంటి సైదులు,హాలియా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాంపాటి పాండరయ్య,బీజేపీ రాష్ట్ర నాయకుడు చెన్ను వెంకటనారాయణ రెడ్డి,ఆదర్శ ఉపాధ్యాయులు కంచర్ల సోమిరెడ్డి,అనుముల మండల పిఆర్ టియూ ఎస్ సీనియర్ నాయకులు నోవా,కుంచం హరివర్ధన్,కట్టంగూరు మండల ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



---

# బీజేపీ సీనియర్ నేత లతీఫ్ మృతి.. పార్టీకి తీరని లోటు

## - కుటుంబ సభ్యులను పరామర్శించిన బీజేపీ నాయకులు



**నడిగూడెం, ఆగస్టు 30, ప్రజాజ్యోతి:**

నడిగూడెం మండలానికి చెందిన బీజేపీ సీనియర్ మండల నాయకులు షేక్ లతీఫ్ మృతి చెందడంతో బీజేపీ మండల నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ నడిగూడెం మండల అధ్యక్షుడు బండారు వీరబాబు యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన లతీఫ్ మృతి బీజేపీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఓర్సు వేళంగి రాజు, మాజీ మండల అధ్యక్షుడు దున్న సతీష్, చిలుకూరు మండల అధ్యక్షుడు మహేష్, మండల ప్రధాన కార్యదర్శులు రౌతు కళ్యాణ్, కేశగాని పాపయ్య, ఉపాధ్యక్షులు ముప్పా నరసింహారావు, బీరవెల్లి గోపాల్‌రెడ్డి, మామిడి రామకృష్ణ, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రౌత్ వర్మ, మండల కార్యదర్శి రవి, యువ నాయకులు మామిడి గురుస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# బీబీగూడెంలో పోలీస్ కార్డన్ అండ్ సెర్చ్

## – 52 ద్విచక్ర వాహనాలు,4 కార్లు సీజ్

## – ప్రజల భద్రతకు పోలీస్ శాఖ నిరంతరం కృషి

## – డీఎస్పీ ప్రసన్నకుమార్



**చివ్వెంల ఆగస్టు 30(ప్రజాజ్యోతి):**

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు అనుక్షణం కృషి చేస్తున్నామని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు.ఆదివారం చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్,స్థానిక ఎస్ఐ మహేశ్వర్, సర్కిల్ ఎస్ఐతో పాటు సుమారు 50 మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. గ్రామంలోకి వచ్చే,వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వ హించారు. గ్రామం లోని ప్రతి ఇంటిని తనిఖీ చేసి భద్రతా పరిస్థితులను పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించడంతో పాటు ఫింగర్‌ప్రింట్ డివైస్ ద్వారా వేలిముద్రలను పరిశీలించారు.తనిఖీల్లో సరైన అనుమతి పత్రాలు, ధ్రువపత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలు, 4 కార్లను పోలీసులు సీజ్ చేశారు. వాహనాలకు సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని డీఎస్పీ సూచించారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో వాహనాలను గుర్తించేందుకు, దర్యాప్తు సులభతరం చేసేందుకు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని తెలిపారు.



### ప్రజల సహకారంతో ఆధునిక పోలీసింగ్



అనంతరం గ్రామ ప్రజలతో డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడి సామాజిక, భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజల భద్రత, రక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారంతో ఆధునిక పోలీసింగ్ విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు.నేరాల నివారణలో ప్రజలు పోలీసులతో భాగస్వాములు కావాలని,గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.గ్రామాలకు కొత్తగా వచ్చే అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సూచించారు.డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవడం ద్వారా భావితరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.యువత ఆదర్శంగా నిలిచి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణించాలని సూచించారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ మోసాల వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని డీఎస్పీ తెలిపారు. అత్యాశకు లోనై అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ తదితర వివరాలను వెల్లడించవద్దని సూచించారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ప్రజల రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు.

# డాక్టర్ మూసా అలీ ఖాన్‌కు 'అమీర్ అలీ ఫౌండేషన్' పురస్కారం

**హాలియా,ఆగస్టు30(ప్రజా జ్యోతి)**

నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రముఖ నటుడు, సామాజికవేత్త డాక్టర్ మూసా అలీ ఖాన్‌ను అమీర్ అలీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం అమీర్ అలీ ఫౌండేషన్ అవార్డుతో ఘనంగా సత్కరించారు.శ్లోకా స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అమీర్ అలీ ఫౌండేషన్ చైర్మన్ అమీర్ అలీ మాట్లాడుతూ డాక్టర్ మూసా అలీ ఖాన్ సమాజ హితమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ఉచిత రక్తదాన శిబిరాలు,చేపడుతున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు తెలుగు ఉభయ రాష్ట్రాల్లోని యువతకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని కొనియాడారు. నటుడిగా కళారంగానికి సేవలు అందిస్తూనే,సామాజికవేత్తగా మిర్యాలగూడ ప్రాంతంలో నిరంతరం ప్రజాసేవలో మునిగితేలడం అభినంద నీయమని ఆయన పేర్కొన్నారు.పురస్కార గ్రహీత డాక్టర్ మూసా అలీ ఖాన్ మాట్లాడుతూ అమీర్ అలీ ఫౌండేషన్ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించడం ఎంతో గర్వంగా ఉందన్నారు.ఈ పురస్కారంతో తన సేవా ప్రయాణంలో మొత్తం 108 అవార్డులు పూర్తవ్వడం వర్ణించలేని సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు.తనను నిరంతరం ఆశీర్వదిస్తూ, ప్రోత్సహిస్తున్న ఉభయ రాష్ట్రాల ప్రజలకు,అభిమానులకు ఆయన ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో అమీర్ అలీ ఫౌండేషన్ సభ్యులు,పలువురు స్థానిక ప్రముఖులు,మూసా అలీ ఖాన్ అభిమానులు పాల్గొన్నారు.




# ఉచిత దంత వైద్య శిబిరం అభినందనీయం

**చింతలపాలెం, ఆగస్టు 30 (ప్రజా జ్యోతి) :**

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీ కళ్యాణి డెంటల్ క్లినిక్, కోదాడ వారి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా దంత పరీక్షలు, వైద్యుల సలహాలు అందిస్తున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరాన్ని చింతలపాలెం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకులు వంగవీటి అంబరీష్, 2వ వార్డు సభ్యులు చింతిరాల సురేందర్, నాయకులు మల్ రెడ్డి కృష్ణారెడ్డి, దొంగల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జయశ్రీ – అఖిల్ యాదవ్ ల వివాహ వేడుక:

## హాజరై ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్

**కట్టంగూరు , ఆగస్టు 30,(ప్రజా జ్యోతి) :**

నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల కేంద్రంలోని యం ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో అర్వపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పులిచర్ల ప్రభు యాదవ్ మేనకోడలు జయశ్రీ – అఖిల్ యాదవ్ వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఈ శుభకార్యానికి తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా. గాదరి కిశోర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళ్యాణ వేదికపై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వరుడి తరఫు, వధువు తరఫు కుటుంబ సభ్యులతో మాట్లాడి శుభాకాంక్షలు పంచుకున్నారు.ఈ వివాహ వేడుకలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పులిచర్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# దేవరకొండలో ఘనంగా అర్చన మహేష్ ల వివాహ వేడుక

## హాజరై ఆశీర్వదించిన

### -ఎబిఆర్ఎస్ యువ నాయకుడు ఇస్లావత్ అభిషేక్ నాయక్



**దేవరకొండ, ఆగస్టు 30, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని వైష్ణవి ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన చి.ల.సౌ. అర్చన చిరంజీవి మహేష్ ల వివాహ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఇస్లావత్ అభిషేక్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కళ్యాణ వేదికపై నూతన వధూవరులను కలిసి, వారికి పుష్పగుచ్ఛం అందించి ఇస్లావత్ అభిషేక్ నాయక్ తన హృదయపూర్వక ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివాహ బంధంతో ఒక్కటైన అర్చన, మహేష్ ల వైవాహిక జీవితం ప్రేమ, అప్యాయతలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కొత్తగా సంసార జీవితంలోకి అడుగుపెడుతున్న ఈ నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో నూరేళు వర్ధిల్లాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ వివాహ వేడుకలో వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు స్థానిక బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.